క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాలకు భూమి పూజ

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు అంబేడ్కర్ కాలనీలో నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించామని అంబేడ్కర్ యూత్ సభ్యులు తెలిపారు. వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ ప్రధాన రహదారికి ఆనుకొని ఈ విగ్రహ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సందీప్‌రెడ్డి ప్రార్థనతో ప్రారంభిచారు. కార్యక్రమంలో కుమ్మరి ఫ్రాంచేస్, బీ మాణిక్య రావు, నూతలపాటి జోసేష్, కే చంటి, గర్నెపూడి ప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కారంచేడు: వాహన యజమానులు తప్పకుండా తమ వాహన పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం ఆయన వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్, అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలో వాహన తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, కార్‌లు వంటి వాహనాలకు అవసరమైన అన్ని రకాల పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు ఆయన జరిమానాలు విధించారు.

పోషకాహారం ఆరోగ్యానికి మూలం



మాట్లాడుతున్న సీడీపీవో ఎలిజిబెత్ రాణి

జే.పంగులూరు: పోషకాహారం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవడమే కాకుండా, శారీరక దృఢత్వాన్ని పెంచుకోవచ్చని సీడీపీవో ఎం ఎలిజిబెత్ రాణి అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహాపోషణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. తల్లులు, గర్భిణులు, బాలింతలు మొదటి నుంచి పుష్టికరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. రాగులు, జొన్నలు, సజ్జలు తదితర ఆహారాలు తీసుకోవాలని, కూరగాయలు ఎక్కువగా వాడాలని ఆమె సూచించారు. ముప్పవరం సెక్టారు సూపర్‌వైజర్ పద్మజా మాట్లాడుతూ ప్రతి బిడ్డకు ఏడవ నెల నుంచి పుష్టికరమైన ఆహారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఐ శ్రీలక్ష్మి, వి శ్యామల, పి సుధారాణి, టి ప్రసన్న కుమారి, సుజాత, అనిత, ఏఎన్‌ఎం రామాంజమ్మ, ఆయాలు పాల్గొన్నారు.


మహాకవి గురజాడ రచనలు చదవాలి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చీరాల రూరల్: మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి వేడుకలను ఊరూరా జన విజ్ఞానం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీనియర్స్ సిటిజన్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు గురజాడ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కోట వెంకటేశ్వర రెడ్డి, కూరపాటి నారాయణ మాట్లాడుతూ.. గురజాడ అభ్యుదయ వాదం నేటి సమకాలీన సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నేటి సమకాలీన సమాజ పరిస్థితులలో మరొకసారి గురజాడ రచనలను చదవాలని వారు కోరారు. కార్యక్రమంలో సింహాద్రి యల్లమందారెడ్డి, రిటైర్డు ఏసీపీ కట్టా రాజ్ వినయ్‌కుమార్, వెన్నెలకంటి సీతారామ శర్మ, శీలం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నగదు ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

చీరాల రూరల్: విద్యార్థులకు నగదు ప్రతిభా పురస్కారాలు అందజేయడం ఎంతో మంచి పరిణామమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులు ఐశ్వర్య, టి. దాసు, ఎల్. రాజేష్, ఎన్. అయ్యప్పలకు పుల్లగూర జయరావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగూర జయశీలరావు చేతులు మీదుగా నగదు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కాలేజి కరస్పాండెంట్ శీలం విద్యా సాగర రావు, ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు మాట్లాడారు.కార్యక్రమానికి ముందుగా స్థానిక చర్చి పాస్టర్ పిల్లి దేవదాసు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది మంజుల, సుమ, చినపాప, షీలా, రవిచంద్ర, గాస్పర్, అధ్యాపకేతర సిబ్బంది వినీల పాల్గొన్నారు.



నూతలపాడులో బాల త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



వేటపాలెం: అమ్మవారి బంగారు నగలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



అద్దంకి: వేయి స్తంభాల గుడి నుంచి కలశాలు తీసుకెళ్తున్న భక్తులు

బాలా త్రిపుర సుందరి దేవి పాహిమాం!

- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం
- మొదటి రోజు బాలాత్రిపుర సుందరి దేవిగా అవతారం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

యద్దనపూడి/కారంచేడు/పర్చూరు (చినగంజాం)/చినగంజాం: హిందువులకు ప్రధాన పండుగ దసరా.. దసరా నవరాత్రులను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇందులో భాగంగా అమ్మవారు సోమవారం మొదటి రోజు బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లోక కల్యాణం కోసం అవతరించిన బాలా త్రిపుర సుందరి మనిషి శరీరంలో ఉన్న జాగృత, స్వప్న, శుషుప్తి గణాలకు అధిదేవతగా పేర్కొంటారు. అంటే మనిషి ఈ మూడు స్థితిల్లోనే జీవిస్తుంటాడు. అలాంటి మూడు స్థితులను కూడా అధీనంలో ఉంచుకోగలిగేది త్రిపుర సుందరి దేవి. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ఉత్సవాలల్లో భాగంగా అమ్మవారిని మొదటి రోజు బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోలేరమ్మ గుడి ట్రస్ట్ చైర్మన్ వణుకూరి ప్రభాకరరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు, అమ్మవారికి లడ్డు ప్రసాదం సమర్పించిన వణుకూరి వెంకారెడ్డి, అంజమ్మ దంపతులు, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు ఎర్రం సీతారావమ్మ ఆధ్వర్యంలో అవధూతేంద్ర భక్త భజన సమాజం వారిచే సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదిపూడి మోహన్‌కృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రమణ్యం భక్తులు పాల్గొన్నారు.



జాగర్లమూడిలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



కొప్పరపాడులో అలంకరణలో అమ్మవారు



భవానీపురంలో బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కారంచేడులో బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దుర్గమ్మతల్లి

■ యద్దనపూడి మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు గణపతి పూజ, అఖండస్థాపన, అష్టదిక్పాలక పూజ, సప్తశతి పారాయణం, మహానివేదన, కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మండలంలోని జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారు, పూనూరు త్రిపుర సుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయం, శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో త్రిపురసుందరి, గాయత్రిదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ ఆలయం, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.

■ కారంచేడులో విజయవాడ కనకదుర్గమ్మను పోలిన కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నేళ్లుగా ఆలయ ధర్మకర్తల ఇంటి నుంచి అమ్మవారి నగలు వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వరస్వామివారి దేవాలయం, వేణుగోపాలస్వామి గుడి, పెదబజారు శివాలయం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, శివాలయం, వల్లభరాయ స్వామివారి ఆలయంలలోను ప్రత్యేకంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, లైబ్రరీ వద్దగల మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద గల మందిరం, ఆణుమల్లిపేట మహాలక్ష్మచెట్టు మందిరం, రావూరిపేట రామమందిరి వద్ద దసరా సందర్భంగా బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు.

■ చినగంజాం రైల్వేస్టేషన్ సెంటర్‌లోని భవానీపురంలో వేంచేసి ఉన్న విజయకనకదుర్గా అమ్మవారు దేవాలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభించారు. ముందుగా ఆలయంలో అమ్మవారి కలశ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్కల వెంకటేశ్వర్లురెడ్డి, పద్మజ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆలయ పూజారి మాజేటి శ్రీనివాస శర్మ బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



అద్దంకి: 108 కలశాలతో నీటిని తెస్తున్న మహిళా భక్తులు

వేటపాలెంలో..

వేటపాలెం: దసరా నవరాత్రోత్సవాలు మండలంలోని వివిధ దేవాలయాల్లో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాలను రంగులతో సుందరంగా తీర్చిదిద్ది, విద్యుత్ దీపాలతో అలకంరించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోగల రాజ్యలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయాన్నే సుప్రభాత సేవ నిర్వహించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన, మండపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో రాత్రి నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆహుతులను ఆనందింపజేసింది.

108 కలశాలతో అమ్మవారికి పూజలు..

అద్దంకి/బల్లికురవ: దసరా శరన్నవరాత్రుల పండుగ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అద్దంకిలో పట్టంలోని కన్యాకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మేళతాళాలతో 108 మంది మహిళలు 108 కలశాలతో గుండ్లకమ్మ నది వద్దకు వెళ్లి నీటిని తీసుకుని వచ్చి అమ్మవారిని అభిషేకించారు. అదే విధంగా పట్టణంలోని వేయి స్తంభాల దేవస్థానం, కమతేశ్వర, ధ్వనంతరీ దత్తపాదుకా క్షేత్రం, రామలింగేశ్వర, తిమ్మాయపాలెం గ్రామంలోని గంగా పార్వతీసమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానాలు, శింగరకొండలోనూ ప్రత్యేక పీఠాలు ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

■ బల్లికురవ మండలం కొప్పరపాడులోని బొడ్డురాయి సెంటర్, కొణిదెనలోని బ్రహ్మకుండం వద్ద ప్రత్యేకంగా మండపాల ఏర్పాటుతో అమ్మవారి విగ్రహాన్ని తెచ్చి వేడుకలు చేపట్టారు. చెన్నుపల్లి, కొండాయపాలెం, చిన అంబడిపూడి, కొణిదెన, శివాలయాల్లోని పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేడుకలు నిర్వహించారు.

ఐక్యంగా ఉండి పోరాడితే గెలుపు సాధ్యం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి



పర్చూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయిన ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి పోరాడితేనే పార్టీ గెలుపు సాధ్యమవుతుందని అందరూ సమష్టిగా పార్టీని ముందుకు నడపాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. పర్చూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పర్చూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరిగే గ్రామస్థాయి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ స్థాయి ఏజెంట్‌ల నియామకం గురించి నాయకులతో చర్చించారు. గ్రామాల్లో సమర్థులైన వారు, ఓటు బ్యాంకును సమకూర్చగలిగిన వారు, పార్టీ ఓటర్లను ఓటు వేయించగలిగే సామర్థ్యం ఉన్న వారు నాయకులుగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎంపిక సమయంలో గ్రామంలోని అందరూ నాయకులను సమావేశపరచి ఏకాభిప్రాయం మేరకు ఎంపిక జరిగేలా చూడాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, మండల కన్వీనర్‌లు కఠారి అప్పారావు, జంపని వీరయ్య చౌదరి, రావూరి వేణుబాబు, ఉప్పలపాటి అనిల్, ముప్పాళ్ల రాఘవయ్య, కొల్లా శ్రీహరి, వై హరిప్రసాద్, కట్టా రత్నరాజు, మైలా నాగేశ్వరరావు, గాదె సురేష్, మల్లా శ్రీను, కంచనపల్లి రమేష్, జంగా అనిల్, కూరాకుల ఇస్సాక్, జంగా వంశీ, దాసరి వెంకట్రావు, కొల్లా శ్రీను పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌తో సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో

చీరాల టౌన్: సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్‌ఎస్ చక్కటి వేదిక అని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆర్డీవోకు అందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రకాల రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజలు 18 అర్జీలను అందించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇంటిస్థలాలు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై డీటీ సుశీలకు ప్రజలు అర్జీలు అందించారు.

కార్మికులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం



అద్దంకిలో నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అద్దంకి: ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటల పని విధాన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పనిగంటలను పెంచుతూ పెట్టిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ అద్దంకి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ మస్టర్ టైంలో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మిక వ్యతిరేక బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు దాసరి వీరయ్య, జ్యోతివెంకటరావు, దాసరి అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు చీరాల పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియూ చీరాల పట్టణ కన్వీనర్ ఎం.వసంతరావు మాట్లాడుతూ పనిగంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోకుంటే పెద్ద ఎత్తున కార్మిక వర్గం పోరాటానికి సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాబూరావు, జి.సుధాకర్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు బాధితులతో కలసి వినతి పత్రాలు అందజేస్తున్న నాయకులు

చీరాల రూరల్: పట్టణ ప్రాంతంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న నిరుపేద యానాది సామాజిక పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ఏపీ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో చంద్రశేఖర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భం బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటి మార్కు, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్, జిల్లా ఇన్‌చార్జ్ ఎస్. భగత్, చీరాల అభివృద్ధి సాధనా సమితి నాయకులు శీలం రవి, ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎంతో కాలంగా సొంత ఇల్లులేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని వారు ఆర్డీవోకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్డీవో యానాది సామాజిక వర్గానికి చెందిన పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

చీరాల అర్బన్: వ్యక్తి అదృశ్యంపై సోమవారం చీరాల రూరల్ ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు. చీరాల మండలం ఈపురుపాలెం గ్రామానికి చెందిన ఆకురాతి మోహనరావు కుటుంబ సమస్యల నేపథ్యంలో సోమవారం ఉదయం 5గంటల సమయంలో ఇంటి నుంచి కనబడకుండా వెళ్లారని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తి ఆచూకి తెలిసిన వారు ఎస్సై నెంబర్ 91211 02144కు తెలియజేయాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి



అధికారులకు అర్జీలు ఇస్తున్న దళిత నాయకులు

మార్టూరు: మండలం డేగరమూడి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అదృశ్యమైన ఘటనపై విచారణ జరిపించి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠింప చేయాలని దళిత నాయకులు సోమవారం బాపట్ల కలెక్టర్, ఎస్పీని కోరారు. గ్రామంలో స్థానికులు ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని గతవారం అధికారులు అనుమతులు లేవంటూ తొలగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నాయకులు గ్రీవెన్స్ సెల్లో కలెక్టర్, జిల్లా ఎస్పీకి అర్జీలు ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు జెట్టి ఖాజావలి, బెంజిమెన్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఏ. ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు

మార్టూరు: కాలానుగుణంగా పంటల మార్పిడి.. ప్రత్యామ్నాయ పంటలతోనే వ్యవసాయ లాభసాటిగా మారుతుందని ఆత్మ పీడీ విజయనిర్మల అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్, లాం శాస్త్రవేత్త ఉమాదేవి, మార్టూరు ఏడీఏ సుదర్శన రాజు, ఏవో లావణ్య, ఉద్యానవన శాఖ అధికారి బీ హనుమంతు నాయక్ సమావేశంలో మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, సోయా చిక్కుడు, మినుము, శనగ పంటలు సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల అధికారి రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు మార్టూరు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రులు

అద్దంకి: పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 400 సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన మరో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్మార్టు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీ పద్మావతి రిటైర్మెంట్ కార్యక్రమంలో ఇరువురు మంత్రులు పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు.

వైభవంగా భావన్నారాయణుని బ్రహ్మోత్సవాలు



తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి దేవాలయంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవి సమేత భావన్నారాయణుని 18 వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు పూజా కార్యక్రమాలలో భాగంగా శ్రీవారు, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, పెళ్లికుమారుడు. పెళ్లికుమార్తెల అలంకరణను నిర్వహించారు. శాశ్వత ఉభయ దాతలుగా వలివేటి లక్ష్మీకుమార్, సులోచన దంపతులు వ్యవహరించగా పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.